## యువత సమస్యను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, మే 11: రాష్ట్రంలోని యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి పెట్టిన సిబిల్ స్కోర్ విధానంను రద్దు చేసి, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై యువత ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.

## నిమ్స్‌కు వచ్చి..అదృశ్యం


అహ్మద్ పాషా (ఫైల్)

ఖైరతాబాద్, మే 11 : నిమ్స్ దవాఖానలో ఉన్న తన తల్లిని చూసేందుకు వచ్చిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మెదక్ జిల్లాకు చెందిన ఎండీ అహ్మద్ పాషా ఈ నెల 9న నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న తన తల్లిని చూసేందుకు వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి వస్తానంటూ చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. వెంటనే ఫోన్ చేయగా, తాను ఎక్కడ ఉన్నది స్పష్టంగా చెప్పలేకపోయాడు. మరికొద్ది సేపటికి వేరే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ తాను శ్రీనగర్ కాలనీలోని సాయిబాబా గుడిలో ఉన్నట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా, కనిపించలేదు. మరోసారి ఫోన్ చేయగా, స్పందించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

హిమాయత్ నగర్, మే 11: కార్మికులకు నష్టపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మొట్టె నరసింహ, అధ్యక్షుడు మారగోని ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం హిమాయత్ నగర్ లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తుందని విమర్శించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాలు చేస్తేనే హక్కులను కాపాడుకో గలుగుతారని ఆ దిశగా కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్,ఉపాధ్యక్షులు జి. రాజు , గాదె లక్ష్మీనారాయణ, జి పరమేష్,సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నేతలు సామల మల్లేష్ ,కే వెంకటేష్, శివ శంకర్ , పిట్టల సమ్మయ్య, కడారి రాములు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం

శ్రమశక్తి అవార్డు గ్రహీత రామారావును తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని కుమ్మరి సంఘం సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ తన సేవలను గుర్తించి శ్రమశక్తి అవార్డు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యలను నిరంతరం పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు నేదునూరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి కొల్లూరు అనిల్, గోల్కొండ ఉత్సవ కమిటీ చైర్మన్ కాకులారం శంకర్, యాదయ్య, శ్రీరాములు, మహేష్, శ్రీకాంత్, అప్పారెడ్డి ముఖేష్, కృష్ణ, రామకృష్ణ, అనిల్, సజ్జన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, మే 11

## వెలకట్టలేనిది..తల్లి ప్రేమ


మాతృదినోత్సవం సందర్భంగా సేవా భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జయప్రదదేవిని సన్మానిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, మే 11: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భావన రుషి కాలనీలో మాతృదినోత్సవాన్ని నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివాం ఘనంగా నిర్వహించారు. ఆర్పీ తిరుపతమ్మ, ఆశవర్కర్ లక్ష్మి తల్లులకు పాదపూజ చేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవా భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జయప్రదదేవి హాజరై ఆమె మాట్లాడుతూ తల్లి ప్రేమకు ప్రత్యామ్నాయం లేదన్నారు. తల్లి త్యాగాలు, సేవలు మన జీవితానికి వెలకట్టలేని వరం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లి సేవ పుణ్యఫలాలు ఇస్తుందన్నారు. తల్లి ప్రేమ అమూల్యమైదన్నారు. మాతృభక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమార స్వామి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, సాంస్కృతిక కార్యదర్శి శ్రీనివాస్, హేమలత, వందన, గాయత్రి, కాశీగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



### హరిహర క్షేత్రంలో ..

బోరబండ స్వరాజ్ నగర్‌లోని హరిహర క్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 2వ రోజైన ఆదివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను భక్తులు అధిక సంఖ్యలో తిలకించారు. అనంతరం అన్నదానం జరిగింది. సాయంత్రం గరుడ సేవ, పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. నేటి(సోమవారం)తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త కల్వల సత్యనారాయణ రావు తెలిపారు. – ఎర్రగడ్డ, మే 11

## గండిపేట మండల కురుమ సంఘం కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా దొబ్బ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర రమేష్


గండిపేట మండలం కురుమ సంఘం జరిగిన ఎన్నికల్లో ఎన్నుకున్న నూతన కార్యవర్గ సభ్యులు, కుల సంఘ పెద్దలు

మణికొండ, మే 11 : గండిపేట మండలం కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా మంచిరేవుల గ్రామానికి చెందిన దొబ్బ భాస్కర్ కురుమను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మణికొండ మల్లన్న, బీరప్ప దేవాలయం ప్రాంగణంలో ఆదివారం జరిగిన నూతన కార్యవర్గాన్ని కుల సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా దొబ్బ భాస్కర్ కురుమ( మంచిరేవుల), ఉపాధ్యక్షులుగా కే రాములు (బండ్లగూడ), డి శ్రీనివాస్ (వట్టి నాగులపల్లి), ప్రధాన కార్యదర్శిగా తాండ్ర రమేష్ (బండ్లగూడ), సహా కార్యదర్శిగా లక్ష్మణ్ (బండ్లగూడ), కోశాధికారిగా రత్నాకర్ (గండిపేట), సహా కోశాధికారిగా హరి కృష్ణ మణికొండ) లను కురుమ సంఘం పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా కురుమ సంఘం పెద్దలు బి. జైహింద్ రావు, శ్రీరాములు, యాదయ్య, బీరప్ప, లక్ష్మీనారాయణ ల నేతృత్వంలో ఎన్నిక నిర్వహించారు. ఆదివారం ఎన్నికైన ఈ నూతన కార్యవర్గం రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతుందన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దొబ్బ భాస్కర్ మాట్లాడుతూ గండిపేట మండలంలో కురుమ సంఘం అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు అన్ని గ్రామాలలో కురుమ సంఘం గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుంచి కుల సంఘాన్ని పటిష్ట పరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికొండ కురుమ సంఘం అధ్యక్షుడు చిలుకూరి బీరప్ప, ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ముత్యాలు, మహేందర్, గణేష్, బాబు, లక్ష్మణ్, వట్టి నాగులపల్లి, ఖానాపురం, మంచిరేవుల, మణికొండ, పుప్పాలగూడ, బండ్లగూడ తదితర గ్రామాల కురుమ సంఘం నాయకులు, కుల పెద్దలు హాజరయ్యారు.

## 22న కొత్తకోటలో బీసీ చైతన్య భారీ బహిరంగ సభ

కాచిగూడ: బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అందుకు జనాభా దామాషా ప్రకారం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ఆదివారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోషల్ డెమోక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ కోల జనార్దన్ గౌడ్, రాష్ట్ర చైర్మన్, బీసీ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చెన్న రాము లు ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన హోటల్లో వివిధ బీసీ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వి.హెచ్, జాతీయ ఎస్‌డీ జాక్ చైర్మన్ కోలా జనార్దన్‌గౌడ్ హాజరై ఈనెల 22న ఉమ్మడి మహబూబ్ నగర్ లోని కొత్త కోటలో వెనుకబడిన కులాల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ చైతన్య సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.హెచ్ మాట్లాడు తూ 60 శాతం జనాభా ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో ఆర్టికల్ 340 ప్రకా రం చట్టబద్ధత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్న రాములు ముదిరాజ్, జాతీయ చైర్ పర్సన్ స్వరూప, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## నైపుణ్యం పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు

కాచిగూడ, మే 11: విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని బ్రహ్మకుమారి అంజలి అన్నారు. బర్కత్ పురలోని హైందవి కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌ను ఆదివారం అంజలి, హైందవి విద్యాసంస్థల చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బ్రహ్మకుమారిస్ అంజలి హాజరై మాట్లాడుతూ జీవితంలో నిస్వార్థంగా సేవ చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన యువతీ, యువకులకు ప్రస్తుత మార్కెట్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను వినియోగించుకొని, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపు నిచ్చారు. శంకర్ యాదవ్, సిస్టర్ ప్రశాంతి, విజతరెడ్డి, రఘుపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సంగీతం మానసిక ఆనందానికి దోహదం


హిమాయత్ నగర్‌లోని మ్యూజిక్ అకాడమీలో గాయనీ,గాయకులను సత్కరిస్తున్న త్రినాథరావు

హిమాయత్ నగర్, మే 11: సంగీతం మానసిక ఆనందాన్ని అందిస్తుందని నిత్య గాన తపస్వి డాక్టర్ చింతలపూడి త్రినాథరావు అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని శారదా కల్చరల్ లైవ్ స్టూడియోలో శ్రీ శారదా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జంట నగరాల ప్రముఖ గాయనీ గాయకులతో సినీ సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అలసిన మనసుకు సంగీతం సాంత్వన చేకూరుస్తుందని, గానం తనకు ఆరో ప్రాణమని తెలియజేశారు. అర్చన వెంకటేశ్వర రావు, నాగేశ్వరరావు, చిన్న, అచ్యుత, లలిత, కార్తికేయలు ఆలపించిన సినీ గీతాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, బి.ఎం. నాయుడు, ఉదయ్ కుమార్,సంస్థ వ్యవస్థాపకురాలు శారద పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి

చిక్కడపల్లి, మే 11: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఎంపీ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ (డబ్ల్యూసీహెచ్‌సీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్క్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన ఎంపీ నిధుల ద్వారా పార్కులోని షటిల్ కోర్టు పునరుద్ధరణ, పిల్లల ఆట పరికరాల ఏర్పాటుకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, కోశాధికారి దశరథ, ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, నాగభూషణం, మురళీకృష్ణ, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.వివేక్, వివేక్, 301 గవర్నర్ కార్యదర్శి శైలజ, కాసాని ఆనంద్, అంజీయాదవ్, నవీన్‌నాయక్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

చిక్కడపల్లి, మే 11: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అన్నారు. రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం బాగ్‌లింగంపల్లి నైబర్ హుడ్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న వివిధ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రజా సమస్యలను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, ముదిగొండ మురళి, గోక నవీన్. ఎర్రం శేఖర్. కళ్యాణ్‌నాయక్, జ్ఞానేశ్వర్‌గౌడ్, పి.విజయ్‌కృష్ణ, తులసి, మంజుల, మరియా, సాబీర్, కూరగాయల శ్రీనివాస్, మున్ననాయక్, దేవేందర్‌నాయక్, నితిన్, పున్న ప్రవీణ్, పోస్టర్ శ్రీనివాస్, డాన్సర్ మహేష్, పద్మారావు, వెంకట్ పాల్గొన్నారు.

## ప్రజలకు ఉత్తమ సేవలందించాలి




ప్రజలకు ఉత్తమ సేవలందించడానికి పోలీసులు నిరంతరం కృషి చేయాలని టోలిచౌకి పోలీస్ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. టోలిచౌకి, అజీజ్ బాగ్, అరవింద్ నగర్, సమతాకాలనీ, హకీంషా, పారామౌంట్ ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో పాటు, ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్, అదనపు ఇన్‌స్పెక్టర్ బాలరాజ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.
– మెహిదీపట్నం, మే 11

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, మే 11: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 9న దుర్గానగర్ చౌరస్తాలో వేగంగా వచ్చిన టీజీ12టీ2204ను గల అశోక్ లేలాండ్ వాహనంను డ్రైవర్ సయ్యద్ సోహెబ్ వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 30–35 ఏండ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి ఆచూకీ కోసం స్థానికంగా వాకాబు చేసినా ఎలాంటి సమాచారం అందలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

### వీరజవాన్లకు అండగా నిలవాలి

కాచిగూడ, మే 11: ప్రాణాలను లెక్కచేయకుండా దేశ భద్రత, దేశ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వీరజవాన్లకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలని సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడు ఎస్.నారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్ శ్యామ్ అన్నారు. ఆదివారం కాచిగూడ అభినందన్ హోటల్లో ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి, సైనికులకు అండగా కాచిగూడలోని పలు ప్రాంతాల్లో వందలాది మందితో తిరంగ్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనిక కుటుంబాలకు రాజకీయాలకు అతీతంగా అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఆల్ జోన్స్ ప్రధాన కార్యదర్శి శ్రీ కిషన్ శర్మ, సయ్యద్ యూనిస్ పరిదోద్దీన్, మధుసూదన్ కుమాని, బసంత్ కౌర్, శ్రీలత పాల్గొన్నారు.

### కార్వాన్ నియోజకవర్గంలో..

మెహిదీపట్నం : కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ రాందేవ్ గూడ పద్మానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భారత్, పాకిస్థాన్‌కు జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్, సచిన్ యాదవ్ రావుకు స్థానిక ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పద్మానగర్ కాలనీ గ్రౌండ్ నుంచి రామ్‌దేవ్ గూడ మెయిన్ రోడ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.




## ఎక్కేదెలా..దిగేదెలా..!

### ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్లపై ముళ్లకంచెలు

### సోయిలేని అధికారులు

### ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు

హైదరాబాద్‌లోని పర్యాటక స్థలాల్లో ప్రసిద్ధిగాంచిన ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ గార్డెన్‌ను చూసేందుకు దేశ నలుమూలల నుంచి సందర్శకులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తారు. మండు వేసవిలో సాగర అందాలను వీక్షిస్తూ, అక్కడున్న పచ్చదనాన్ని ఆస్వాదిస్తారు. ఖైరతాబాద్, నెక్లెస్‌రోడ్, సచివాలయం, ట్యాంక్ బండ్ మీదుగా రాజ్‌భవన్ రోడ్, సికింద్రాబాద్, అసెంబ్లీ, కోఠి, హిమాయత్‌నగర్, నారాయణగూడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కూడా కావడంతో నిత్యం వేలాదిగా వాహనాల రాకపోకలు ఉంటాయి. ఎన్టీఆర్ గార్డెన్ నుంచి సాగర్ తీరానికి వెళ్లాలంటే రోడ్డు దాటాల్సిందే. ప్రమాదాలు నివారించేందుకు పాదచారుల సౌకర్యంగా ఉండేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. అయితే సంబంధిత అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యమో....ఓ పెద్ద ఇనుప కంచెను తెచ్చి ఎన్టీఆర్ గార్డెన్ మెట్ల మార్గంలో వేశారు. దానికి తోడు ఓ పెయిడ్ పార్కింగ్ బోర్డును నిర్వాహకులు మెట్ల మార్గంలోనే అడ్డంగా పెట్టడంతో ఇరుకుగా మారింది. దీంతో పాదచారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కాలంటే ప్రయాస తప్పడం లేదు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై మెట్లు ఎక్కే క్రమంలో ఇనుప ఫెన్సింగ్‌కు పదునైన బ్లేడ్స్ ఉండడంతో మహిళల చీరలు అందులో చిక్కుకొని చినిగిపోతున్నాయి. అంతేకాకుండా చిన్నారులకు సైతం గాయాలైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెట్లపై వేసిన కంచె, అడ్డంగా పెట్టిన పెయిడ్ పార్కింగ్ బోర్డును తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు. – ఖైరతాబాద్, మే 11 :

## నేడు నాయిని నరసింహారెడ్డి జయంతి

### మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

చిక్కడపల్లి, మే 11: మాజీ హోం, కార్మిక శాఖల మంత్రి దివంగత నాయిని నరసింహారెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 10:00 గంటలకు తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్నట్లు చెప్పారు. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానునట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

## సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తా

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అపర్ణ ఫామ్ గ్రోవ్ లో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి అపర్ణ పామ్ గ్రోవ్‌లో ఎమ్మెల్యే అధికారులతో కలిసి కాలనీలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మురుగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపర్ణ పామ్ గ్రోవ్ నందు మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

# పేదల వైద్య సేవలకు సహకారం

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఎల్వోసీ మంజూరు పత్రాలను అందజేసిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

సికింద్రాబాద్, మే 11: పేదల వైద్య సేవలకు తమ సహకారం అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 20 మందికి దాదాపు రూ.7లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను, ఏడుగురికి రూ.9.90 లక్షల విలువజేసె లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) పత్రాలను సీతాఫల్‌మండిలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ ఆదివారం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం భారంగా మారిన దశలో వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని అన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్ మండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నాని పేర్కొన్నారు. వారాసిగూడకు చెందిన గట్టు లక్ష్మికి రూ.రెండు లక్షలు, అబెదా బేగంకు రూ.లక్ష, చిలకలగుడకు చెందిన గఫార్‌కు రూ.1.50 లక్షలు, అబ్దుల్ షోయబ్‌కు రూ.లక్ష, పార్సిగుట్టకు చెందిన వనమాల వాణికి రూ.1.50 లక్షలు, శాంతినగర్‌కు చెందిన మజర్ ఫాతిమాకు రూ.రెండు లక్షల విలువజేసే, ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బెజ్జల సురేష్‌కు రూ.90 వేల ఎల్వోసీ పత్రాలను ఈ సందర్భంగా అందించారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు వీలుగా ఈ పత్రాలను అందించామని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. కార్పొరేటర్లు హేమ, ప్రసన్నలక్ష్మి, శైలజ, సునీతతో పాటు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.